### నేడు సర్వసభ్య సమావేశం

శంషాబాద్ రూరల్, జూన్ 26: నేడు శంషాబాద్ మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో మున్ని తెలిపారు. గురువారం ఉదయం 11 గంటలకు ఎంపీపీ జయమ్మ అధ్యక్షతన మండల సర్వ సభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు వివరించారు. జడ్పీటీసీ, మండలంలోని ఎంపీటీసీలు, ఇతర ప్రజాప్రతినిధులు, మండల స్థాయి వివిధ శాఖల అధికారులు పాల్గొంటారన్నారు. మండలంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం సమావేశంలో చర్చిస్తామన్నారు. సమస్యల పరిష్కారం కోసం అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

### ఎంఎల్‌హెచ్‌పీ నూతన కమిటీ ఎన్నిక

హిమాయత్‌నగర్, జూన్ 26: మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్లు (ఎంఎల్‌హెచ్‌పీ) నూతన కమిటీ ఎన్నికైంది. గౌరవ అధ్యక్షుడిగా తోట రామాంజనేయులు, రాష్ట్ర అధ్యక్షుడిగా బి.సందీప్ కుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా అస్పియా, రాష్ట్ర ఉపాధ్యక్షులు బి.చంద్రకళ, బి.రమ్య, రాష్ట్ర సహాయ కార్యదర్శులు జి.రాము, ఎం.సంధ్య, కోశాధికారి షేక్ లతీఫ్, రాష్ట్ర కార్య వర్గ సభ్యులు శ్రీకాంత్, జితేందర్, ఆర్.దీపిక, మురళి ఎన్నికైనట్లు ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం.నరసింహ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా నేషనల్ హెల్త్ మిషన్ స్కీం పరిధిలో పనిచేసే (ఎంఎల్‌హెచ్‌పీ)మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్ల సమస్యలను పరిష్కరించాలని కోరారు. పీఎఫ్, ఈఎస్ఐ, హెల్త్ ఇన్సూరెన్స్ వంటి సౌకర్యాలను వర్తింపచేసి కనీస వేతనం రూ.45వేల వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

### 'పునరాలోచించండి'

మారేడ్‌పల్లి: జింఖానా మైదానం నుంచి తిరుమలగిరి వెళ్లే రాజీవ్ రహదారి విస్తరణపై పునరాలోచించాలని బుధవారం సచివాలయంలో రవాణ శాఖమంత్రి పొన్నం ప్రభాకర్‌కు కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేశ్‌తో కలిసి ప్రొటెక్ట్ ప్రాపర్టీస్ అధ్యక్షుడు అమర్‌నాథ్ వినతిపత్రం అందజేశారు. మంతా నష్టపోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని మంత్రికి వివరించారు.

# డ్రగ్స్ మహమ్మారిని పారదోలుదాం

- పోలీసు అధికారుల ఆధ్వర్యంలో అవగాహన
- మత్తుపదార్థాలకు వ్యతిరేకంగా విద్యార్థుల ర్యాలీలు
- మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞలు



ర్యాలీని ప్రారంభిస్తున్న డీసీపీ శ్రీనివాస్

వ్యవసాయ యూనివర్సిటీ, జూన్ 26: ఇంటర్నేషనల్ డ్రగ్స్ వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని రాజేంద్రనగర్ పరిధిలో విద్యార్థులకు పోలీసులు అవగాహన కల్పించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాజేంద్రనగర్ జోన్ డీసీపీ సీహెచ్ శ్రీనివాస్ పాల్గొని మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలు, అక్రమ రవాణ పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీసీపీ శ్రీనివాస్ మాట్లాడుతూ సమాజంలో అన్నింటికన్నా విలువైనది మానవ జన్మ అని పేర్కొన్నారు. అందుకు మంచి మార్గంలో నడిచి ఉన్నత స్థాయికి చేరుకొని తల్లిదండ్రులకు, మన ప్రాంతానికి మంచి పేరు తేవాలని సూచించారు. విద్యార్థి దశలోనే, మంచి లక్ష్యం వైపు నడవాలని సూచించారు. మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలన్నారు. వాటికి బానిసై జీవితాలను నాశనం చేసుకోవద్దని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమం ఉందని తెలియగానే ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్‌తో పాటు ఆయా క్యాంపస్‌ల విద్యార్థులు ర్యాలీలో పాల్గొని ప్రతిజ్ఞ చేయడం అభినందనీయమని చెప్పారు. దాదాపు 500 పైగా విద్యార్థులు పాల్గొని, డ్రగ్స్ నిర్మూలన మనందరి బాధ్యత, సే నోటూ డ్రగ్స్, సేవ్‌లైఫ్ నినాదాలతో పెద్ద ఎత్తున ర్యాలీలో పాల్గొన్నారు. డైరీఫాం చౌరస్తా చేరుకొని తిరిగి కళాశాల వరకు భారీ ర్యాలీ నిర్వహించారు.


శంషాబాద్ పట్టణంలో మత్తుపదార్థాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేస్తున్న పోలీసులు, విద్యార్థులు

### మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

శంషాబాద్ రూరల్, జూన్ 26: మత్తు పదార్థాలకు ప్రజలు దూరంగా ఉండాలని శంషాబాద్ డీసీపీ రాజేశ్ పిలుపునిచ్చారు. శంషాబాద్ పట్టణంలో పోలీసుల ఆధ్వర్యంలో మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా బుధవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీపీ రాజేశ్ మాట్లాడుతూ మత్తు పదార్థాలకు యువత, విద్యార్థులు దూరంగా ఉండాలని సూచించారు. వాటిని వాడకుండా ఉంటామని విద్యార్థులు, పోలీసులు ప్రతిజ్ఞ చేసినట్లు తెలిపారు. నేటి విద్యార్థులే రేపటి పౌరులని చెడు అలవాట్లు మనిషిని బానిసగా మార్చివేస్తాయని అన్నారు. చెడు దారుల్లో వెళ్లి జీవితాలను ఇబ్బందుల పాలు చేసుకోవద్దని సూచించారు. కార్యక్రమంలో అడిషినల్ డీసీపీ రాంకుమార్, ఏసీపీ శ్రీనివాస్‌రావు, సీఐ బాలరాజు, వర్ధమాన్ ఇంజినీరింగ్ కళాశాల ఎన్‌సీసీ ప్రోగ్రాం ఆఫీసర్ శ్రీనివాస్‌రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

### టూరిజం ఎండీ ప్రకాశ్‌రెడ్డికి సత్కారం


టూరిజం ఎండీ ప్రకాశ్‌రెడ్డికి పూలబొకే అందించి అభినందనలు తెలుపుతున్న రాజమౌళి

హిమాయత్‌నగర్, జూన్ 26: తెలంగాణ టూరిజం కార్పొరేషన్ ఎండీగా నియమితులైన ఎన్.ప్రకాశ్‌రెడ్డికి తెలంగాణ పర్యాటక అభివృద్ధి సంస్థ కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రతినిధి బృందం శుభాకాంక్షలు తెలిపింది. హిమాయత్‌నగర్‌లోని టూరిజం ప్రధాన కార్యాలయంలో బుధవారం ఎండీని కలిసి పుష్పగుచ్ఛం అందించి శాలువతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సబ్బు రాజమౌళి, నాయకులు ఉడుత రమేశ్, జ్యోతి, రాజ్యలక్ష్మి, వరయ్య, హైమ, గోపి పాల్గొన్నారు.



బోనాల ఉత్సవాలను జరుపుకునేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్లు రహ్మత్‌నగర్ కార్పొరేటర్ సీఎన్ రెడ్డి తెలిపారు. హరితప్లాజాలో మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్ ఆలయ కమిటీలు, అధికారులతో బుధవారం నిర్వహించిన సమావేశంలో పాల్గొన్నట్లు తెలిపారు. బోనాల పండుగను ప్రశాతంగా జరుపుకునేందుకు తగిన ఏర్పాట్లు చేయాలని మంత్రులు అధికారులకు సూచించినట్లు తెలిపారు.

– జూబ్లీహిల్స్




# ప్రజా సమస్యలకు శాశ్వత పరిష్కారం

మణికొండ, జూన్ 26: ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకొని పరిష్కరిస్తున్నామని నార్సింగి మున్సిపాలిటీ చైర్ పర్సన్ మైలారం నాగపూర్ణశ్రీనివాస్ వెల్లడించారు. కోకాపేట్‌లో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను బుధవారం కమిషనర్ ప్రవీణ్‌కుమార్, వైస్ చైర్మన్ విజయబాబులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులు, కాంట్రాక్టర్లకు ఆమె పలు సూచనలు చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ అభివృద్ధి పనుల్లో ఎలాంటి లోపాలు లేకుండా పూర్తి చేయాలన్నారు. కోట్లాది నిధులతో అభివృద్ధి పనులను చేపడుతున్నామని పేర్కొన్నారు. ప్రజాధనం వృథాకాకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ సకాలంలో పనులను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. ఎక్కడ ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు శివారెడ్డి, దుర్గేశ్‌యాదవ్, మున్సిపల్ శానిటేషన్ ఇన్‌చార్జి లచ్చిరాం, సూపర్‌వైజర్ మైపాల్, వర్క్ ఇన్‌స్పెక్టర్ శేఖర్, అనిల్, బిల్ కలెక్టర్ సంజయ్, 5వ వార్డు ఇన్‌చార్జి సంప్రీత్ తదితరులు పాల్గొన్నారు.


కోకాపేట్‌లో అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న చైర్ పర్సన్ మైలారం నాగపూర్ణ

## పథకాలకు దరఖాస్తు చేసుకోండి



ప్రజాపాలన కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఉప కమిషనర్ రవికుమార్

బండ్లగూడ, జూన్ 26: ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాల కోసం అర్హులందరూ దరఖాస్తు చేసుకోవాలని రాజేంద్రనగర్ సర్కిల్ ఉప కమిషనర్ రవికుమార్ పేర్కొన్నారు. రాజేంద్రనగర్‌లో ఏర్పాటు చేసిన ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ కేంద్రాన్ని బుధవారం జీహెచ్ఎంసీ ఉప కమిషనర్ రవికుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా డిప్యూటీ కమిషనర్ మాట్లాడుతూ ప్రజాపాలన కేంద్రంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాల కోసం అర్హులందరు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీపీవో రాధారాణి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## డ్రైనేజీ సమస్యలు తలెత్తకుండా చర్యలు


అవంతినగర్‌లో డ్రైనేజీ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ మహాలక్ష్మి

హిమాయత్‌నగర్, జూన్ 26: వర్షాకాలంలో బస్తీలు, కాలనీల్లో డ్రైనేజీ సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని హిమాయత్‌నగర్ కార్పొరేటర్ జి.మహాలక్ష్మి నారాయణగూడ జలమండలి అధికారులకు సూచించారు. అవంతినగర్‌లో పొంగి పొర్లుతున్న మురుగును బుధవారం ఆమె శుభ్రం చేయించారు. బస్తీల్లో పాదయాత్ర చేసి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకున్నారు. పురాతనమైన డ్రైనేజీ పైపులైన్లు మార్చి వాటి స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయాలని స్థానికులు ఆమె దృష్టికి తీసుకురాగా సమస్య సత్వరమే పరిష్కారం అయ్యేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు జి.రామన్ గౌడ్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

## 'లబ్ధిదారులకు ఇండ్లు కేటాయించండి'

సికింద్రాబాద్, జూన్ 26: నియోజకవర్గంలోని హమాలీ బస్తీలో పెండింగ్‌లో ఉన్న 60 మంది లబ్ధిదారులకు ఇండ్ల కేటాయింపు విషయంలో తగిన న్యాయం చేస్తానని హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి హామీ ఇచ్చారు. హమాలీబస్తీ గృహ నిర్మాణ పరిరక్షణ కమిటీ సభ్యులు ఇటీవల లష్కర్ జిల్లా సాధన సమితి నాయకులను కలిసి మద్దతు కోరిన విషయం తెలిసిందే. సమితి అధ్యక్షుడు చొరవ తీసుకొని బస్తీవాసులతో కలిసి బుధవారం జిల్లా కలెక్టర్‌ను కలిశారు. 60 కుటుంబాలకు ఇండ్లు కేటాయించకపోవ డంతో ఇబ్బందుల పడుతున్నారని విన్నవించారు. బస్తీ వాసులకు తగిన న్యాయం చేస్తామని కలెక్టర్ వారికి హామీ ఇచ్చారు. సమితి సభ్యులు అందజేసిన వినతిపత్రాన్ని హౌసింగ్ అధికారులకు పంపారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో బస్తీవాసులు తదితరులు ఉన్నారు.

### నేడు ప్లాంటేషన్ డ్రైవ్

జూబ్లీహిల్స్, జూన్ 26: భారత ప్రభుత్వ మినిస్ట్రీ ఆఫ్ స్టాటిస్టిక్స్ అండ్ ప్రోగ్రాం ఇంప్లిమెంటేషన్ (ఎంఓఎస్పీఐ) ఆధ్వర్యంలో జూన్ 16 నుంచి 30 వరకు స్వచ్ఛతా పక్వాడా-2024 పక్షోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ప్రధాన కార్యాలయ అసిస్టెంట్ డైరెక్టర్ ఆర్.జయరామ్ ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం మాసబ్‌ట్యాంక్ చాచానెహ్రూ పార్క్‌లో ఉదయం 8 గంటలకు పచ్చదనం-పరిశుభ్రత కార్యక్రమంలో భాగంగా ప్లాంటేషన్ డ్రైవ్ చేపడుతున్నట్లు తెలిపారు.

### ఆదివాసీలకు రక్షణ కల్పించాలి

ఖైరతాబాద్, జూన్ 26: చత్తీస్‌గఢ్‌లోని ఏజెన్సీ ప్రాంతాల్లో నివసిస్తున్న అమాయక ఆదివాసీలను రక్షణ కల్పించాలని ఆదివాసీ హక్కుల పోరాట సంఘీభావ వేదిక ప్రతినిధి కె.శివారెడ్డి కోరారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్, పీవోడబ్ల్యూ నాయకురాలు సంధ్యతో కలిసి మాట్లాడుతూ చత్తీస్‌గడ్‌లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదివాసులపై దమనకాండ కొనసాగిస్తుందన్నారు. అనేక మందిని పొట్టనపెట్టుకుంటున్నారని, కేవలం ఒక్క రాష్ట్రంలోనే కాదని, మహారాష్ట్ర, జార్ఖండ్, ఒడిషా, మధ్యప్రదేశ్, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ సహా మణిపూర్ వంటి సరిహద్దు ప్రాంతాల్లో ఆదివాసీల హక్కులను ప్రభుత్వాలు కాలరాస్తున్నాయన్నారు. అడవిలో ఉన్న అపారమైన సహజ సంపదను కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టేందుకే ఆదివాసీలపై మారణకాండ సృష్టిస్తున్నారన్నారు. కార్పొరేటీకరణకు బలైపోతున్న ఆదివాసీల పోరాటాలకు ప్రజలు మద్దతు పలుకాలని, వారి హక్కులను పరిరక్షించేందుకు కలిసి రావాలన్నారు. ఈ సమావేశంలో ఎన్.నారాయణరావు, భట్టు వెంకటేశ్వర్లు, జ్యోతి, లక్ష్మిదేవి తదితరులు పాల్గొన్నారు.

### విద్యాశాఖ మంత్రిని వెంటనే నియమించాలి

అడ్డగుట్ట, జూన్ 26: రాష్ట్ర ప్రభుత్వం విద్యాశాఖ మంత్రిని తక్షణమే నియమించాలని తల్లుల సంఘం ప్రతినిధులు డిమాండ్ చేశారు. బుధవారం అడ్డగుట్ట బాబు జగ్జీవన్‌రామ్ భవనం లో తల్లుల సంఘం మండల స్థాయి సమావేశం నిర్వహించారు. పాఠశాలలు ప్రారంభమైనప్పటికీ మండలంలో ఇంకా 159 మంది చిన్నారులు బడికి దూరంగా ఉంటున్నారని, వారిని బడికి తీసుకురావాల్సిన బాధ్యత విద్యాశాఖదేనన్నారు.

# చెంచు మహిళ కు అండగా ఉంటాం

- కేసు విచారణలో పోలీసులకు పూర్తి స్వేచ్ఛనిస్తున్నాం: మంత్రి సీతక్క
- నిమ్స్‌లో బాధిత మహిళ, కుటుంబ సభ్యులకు పరామర్శ


మీడియాతో మాట్లాడుతున్న రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క

ఖైరతాబాద్, జూన్ 26: నాగర్‌కర్నూల్ జిల్లా మూలచింతలపల్లికి చెందిన బాధిత చెంచు మహిళలకు అన్ని విధాలుగా అండగా ఉంటామని రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ (సీతక్క) తెలిపారు. నిమ్స్‌లో చికిత్స పొందుతున్న బాధితురాలు, ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఏ అవసరం ఉన్నా తనకు కాల్ చేయాలని కుటుంబ సభ్యులకు భరోసానిచ్చారు. నాగర్‌కర్నూల్ ఎస్పీతో మాట్లాడిన సీతక్క కేసు పురోగతిని అడిగి తెలుసుకున్నారు. నిందితులకు కఠినంగా శిక్ష పడేలా చూడాలని ఎస్పీని ఆదేశించారు. మంత్రి మాట్లాడుతూ ఈ కేసు విచారణలో పోలీసులకు పూర్తిగా స్వేచ్ఛనిస్తున్నామన్నారు. మూలచింతపల్లి ఘటనకు భూ వివాదమే కారణమని తాము భావిస్తున్నట్లు తెలిపారు. ఉమ్మడి రాష్ట్రంలో చెంచుల పునరావసం కోసం కేటాయించిన భూములపై కన్నేసిన కొందరు ఇలాంటి దాడులకు పాల్పడుతున్నారని అనుమానం వ్యక్తం చేశారు. ఇప్పటికే నిందితులపై హత్యాయత్నం, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశామని, బాధితురాలికి ఇప్పటికే రూ.4లక్షల ఆర్థిక సాయాన్ని ప్రకటించినట్లు తెలిపారు. గంజాయి, డ్రగ్స్‌ను పూర్తిగా నిర్మూలించేలా ప్రభుత్వం అడుగులువేస్తుందని, మత్తులో నేరాలకు పాల్పడితే శిక్షలు తప్పవని హెచ్చరించారు. బాధితురాలు పూర్తిగా కోలుకున్నాకే డిశ్చార్జి చేయాలని నిమ్స్ డైరెక్టర్‌ను ఆదేశించారు. మంత్రివెంట స్త్రీ, శిశు సంక్షేమ శాఖ కమిషనర్ కాంతి వెస్లీ, నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ నగరి బీరప్ప, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ నిమ్మ సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

## మల్కారం సహకార సంఘానికి అవార్డు


సహకార సంఘం చైర్మన్ సతీశ్‌కు ఉత్తమ అవార్డు అందజేస్తున్న కొత్తకుర్మ సత్తయ్య, తదితరులు

శంషాబాద్ రూరల్, జూన్ 26: శంషాబాద్ మండలంలోని మల్కారం సహకార సంఘానికి ఉత్తమ అవార్డు లభించింది. ఉమ్మడి రంగారెడ్డి జిల్లా బ్యాంకు మహజన సభను బుధవారం నగరంలో నిర్వహించారు. దీర్ఘకాలిక రుణాల వసుళ్లకు గాను అవార్డుకు ఎంపిక చేసిన్నట్లు జిల్లా అధ్యక్షుడు, టీఎస్ క్యాబ్ ఉపాధ్యక్షుడు కొత్త కుర్మ సత్తయ్య తెలిపారు. మల్కారం సహకార సంఘం చైర్మన్ బుర్కుంట సతీశ్, సీఈవో సురేందర్‌ను ఘనంగా సన్మానించి అవార్డును అందజేశారు. అనంతరం సహకార సంఘం చైర్మన్ సతీశ్ మాట్లాడుతూ కొంతకాలం నుంచి సహకార సంఘంలోని రైతులకు రుణాలు ఇవ్వడంతో పాటు వాటిని తిరిగి చెల్లించే విధంగా రైతులకు అవగాహన కల్పించిన్నట్లు తెలిపారు. అవార్డుతో పాటు సంఘానికి దీర్ఘకాల రుణాల కోసం రూ.2కోట్లు, పంట రుణాలకు రూ.25లక్షలు కేటాయించిన్నట్లు వివరించారు. కార్యక్రమంలో శంషాబాద్ మండలంలోని సహకార సంఘాల చైర్మన్లు మల్లారెడ్డి, దవాణాకర్‌గౌడ్, అధ్యక్షుడు రాందాస్, కృష్ణ పాల్గొన్నారు.

## పరిసరాల పరిశుభ్రతకు పాటుపడాలి


బద్వేల్‌లో స్థానికులతో చర్చిస్తున్న జీహెచ్ఎంసీ డీసీ రవికుమార్

బండ్లగూడ, జూన్ 26: పరిసరాల పరిశుభ్రతకు ప్రతిఒక్కరూ పాటుపడాలని రాజేంద్రనగర్ సర్కిల్ జీహెచ్ఎంసీ ఉప కమిషనర్ రవికుమార్ పేర్కొన్నారు. రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో ఆయన శానిటేషన్ అధికారులు, సిబ్బందితో కలిసి బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన పలు ప్రాంతాల్లో పారిశుధ్య నిర్వహణపై స్థానికులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పారిశుధ్య సిబ్బంది తమ విధులను సక్రమంగా నిర్వర్తించాలని ఆదేశించారు. అన్ని బస్తీల్లో పరిసరాలు శుభ్రంగా ఉండేల చూడాలని తెలిపారు. ప్రజలు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.

## ఆటో కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

మణికొండ, జూన్ 26: ఆటో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై అధికారులు న్యాయం జరిగేలా చూడాలని రంగారెడ్డి జిల్లా రోడ్ ట్రాన్స్‌ఫోర్ట్స్ వర్కర్స్ ఫెడరేషన్ కార్యదర్శి జాజాల రుద్రకుమార్ అన్నారు. గండిపేట మండలం కోకాపేట్‌లో చంద్రారెడ్డి చౌరస్తా వద్ద సీఐటీయూ తెలంగాణ రోడ్ ట్రాన్స్‌ఫోర్ట్స్ వర్కర్స్ ఫెడరేషన్ యూనియన్ ఏర్పాటు చేసిన సమావేశంలో ఆటో కార్మికులు యూనియన్‌లో చేరారు. తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ నార్సింగి మున్సిపల్ అధ్యక్షుడు మహిపాల్‌యాదవ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా రుద్రకుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉచిత బస్సు ప్రయాణం వల్ల ఆటో కార్మికులకు గిరాకీ లేక తీవ్ర ఇబ్బందులపాలై ఆత్మహత్యలు చేసుకుంటున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రూ.10 లక్షల ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పిచాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ గండిపేట మండల కన్వీనర్ డప్పు ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కోకాపేట్‌లో నిర్వహించిన సమావేశంలో బుధవారం నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా ఎం.కుమార్, అధ్యక్షుడిగా యాదగిరి, ఉపాధ్యక్షులుగా రాకేశ్, యాదగిరి, సెక్రటరీగా నారాయణ, జాయింట్ సెక్రటరీగా పి.సుధాకర్, కోశాధికారిగా జగన్, తదితరులను ఎన్నుకున్నారు.